క్లుప్తంగా

ఏపీఎంగా బాధ్యతలు స్వీకరించిన రామేశ్వర్

సి.బెళగల్: డీఆర్‌డీఏ – వెలుగు మండల ఏపీఎంగా రామేశ్వర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఎంఎస్ అధ్యక్షురాలు భాగ్య లక్ష్మి, సీసీలు గుండమయ్య, రాముడు, శ్రీనివాసులు నూతన ఏపీఎం రామేశ్వర్‌కు అభినందనలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆలమూరు హెల్త్‌సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సుబ్బారెడ్డి

పాణ్యం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మద్దూరు ఎంపీహెచ్‌ఈఓ సుబ్బారెడ్డి సూచించారు. గురువారం ఆలమూరు గ్రామంలో హెల్త్‌సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత ప్రాముఖ్యతపై ప్రజలను చైతన్య పరచాలని చెప్పారు. ఇమ్యూనైజేషన్‌పై ప్రక్రియపై ఆరా తీశారు.

భూ సమస్యలపై దృష్టి సారించండి



తహసీల్దార్‌కు బొకే అందజేస్తున్న సర్వేయర్లు

ఓర్వకల్లు: భూ సమస్యలపై సర్వేయర్లు ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ విద్యాసాగర్ సూచించారు. గురువారం మండల నూతన సర్వేయర్ శంకర్‌మాణిక్యం ఆధ్వర్యంలో అసిస్టెంట్ సర్వేయర్లు తహసీల్దార్ విద్యాసాగర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే పనులు నిలిచిపోవడంతో సమస్యలు అధికమయ్యాయని, పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

టెట్ పరీక్షలకు 15మంది గైర్హాజరు

పాణ్యం: మండలంలోని ఆర్జీఎంలో నిర్వహించిన టెట్ పరీక్షలకు 15మంది గైర్హాజరయ్యారని డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 60మందికిగాను 9మంది మధ్యాహ్నం 60మందికి గాను 6మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని వివరించారు. పరీక్ష కేంద్రాలను సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షించారు.

పిల్లలను బాగా చదివించాలి



మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి

పాణ్యం: తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదవించాలి సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. గురువారం రాత్రి చెంచుకాలనీలో చెంచులతో సీఐ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతిఒక్కరూ పిల్లలను ఉన్నత విద్యను చదివించాలని సూచించారు. నాటుసారా, దొంగతనాలు తదితర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, సమాజంలో గౌరవంగా జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి , చెంచులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు



ఓర్వకల్లు: ఓర్వకల్లు మండల నూతన ఎంపీడీఓగా శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శివనాగప్రసాద్ గూడూరుకు బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో డోన్ మండలంలో ఎంపీడీఓగా పనిచేసిన శ్రీనివాసులును ఉన్నతాధికారులు నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

6న సాహిత్యోపన్యాసం

కర్నూలు కల్చరల్: తెలుగు భాషా వికాస ఉద్యమం, సాహితీ సదస్సు ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ముచ్చుకోట వేంకట రామయ్య స్మారకోపన్యాసం ఏర్పాటు చేసినట్లు సాహితీ సదస్సు అధ్యక్షులు కురాడి కంద్రశేఖర కల్కూర తెలిపారు. 'స్వాతంత్ర్యోద్యమంలో గ్రంథాలయాల పాత్ర' అనే అంశంపై ఉపన్యాసం ఉంటుందని తెలిపారు. బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర ఉపన్యాసకులు డాక్టర్ కె.బడెసాహెబ్ వక్తగా హాజరై ఉపన్యసిస్తారని పేర్కొన్నారు. సాహితీ ప్రియులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ప్రారంభమైన శరన్నవరాత్రోత్సవాలు





పాణ్యం: గౌరిదేవి అలంకరణలో అమ్మవారు, బాలత్రిపురసుందరిగా....



కోడుమూరు: వల్లెలాంబదేవి పల్లకీ సేవలో కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ సతీష్



సి.బెళగల్: బాల త్రిపుర సుందరి అమ్మవారు



రామశంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న దుర్గా కమిటీ సభ్యులు

కోడుమూరు రూరల్: దసరా శరన్నవరాత్రోత్సవాలు గురువారం మండలంలో భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమయ్యాయి. ఆయా ఆలయాల్లోని కాళికాదేవి, వల్లెలాంబదేవి, కన్యకా పరమేశ్వరీ, చౌడేశ్వరీ దేవి అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లు బాల త్రిపుర సుందరి దేవి, ఆదిలక్ష్మి దేవి రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని హంద్రీనది ఒడ్డున వెలసిన వల్లెలాంబదేవికి మాజీ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి దంపతులు, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్, జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వల్లెలాంబదేవి పల్లకీ సేవా కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

గూడూరులో...

దసరా శరన్నవరాత్రోత్సవాలు గురువారం గూడూరు మండలంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. కె.నాగలాపురం గ్రామంలో సుంకులపరమేశ్వరీ అమ్మవారు బాలత్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సుంకులపరమేశ్వరీని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ కుటుంబ సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సి.బెళగల్: దసరా ఉత్సవాలు మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు గ్రామాలలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఈశ్వర ఆలయ ఆవరణలో గ్రామస్తులు దేవి పంచలోహ విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించారు. అనంతరం అర్చకులు సుదర్శమాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కొత్తూరులో చండీ యాగం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన వల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం చండీ యాగం నిర్వహించారు. నవరా త్రోత్సవాల సందర్భంగా లోకకల్యాణార్థం చండీ యాగం ప్రారంభించినట్లు ఈఓ రామక్రిష్ణ తెలిపారు.

గౌరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

పాణ్యం: దేవీ శరన్నవరాత్రోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమయ్యాయి. పాణ్యంలోని దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు గౌరి దేవిగా భక్తులకు దర్శిమిచ్చారు. అలాగే కాన్యకపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరిగా, హైందవశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు బాలత్రిపు సందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే సుగాలిమెట్ట గ్రామంలో వెలసిన నిదానంపాటి అమ్మవారు బాలత్రిపురసుందరిగా భక్తులకు దర్శమిచ్చారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

గడివేముల: గడివేములలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో దసరా నవరాత్రుల్లో భాగంగా వాసకి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని మహిళలు దర్శించుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు వాసవీమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు వసంత లక్ష్మి,సత్యనారాయణ శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఓర్వకల్లు: దశరా శరన్నవరాత్రోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. లొద్దిపల్లె, బైరాపురం, నన్నూరు, హుసేనాపురం, శకునాల, బ్రాహ్మణపల్లె గ్రామాలలో కొలువుదీరిన అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. లొద్దిపల్లెలో మెయిన్ రోడ్డులో కొలువుదీరిన దుర్గాదేవిని సాయంత్రం జిల్లా మాజీ కలెక్టర్ రామశంకర్ నాయక్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్‌ను స్థానిక దుర్గా కమిటీ సభ్యులు దుశ్శాలువాలతో సత్కరించారు. హుసేనాపురంలో కొలువుదీరిన అమ్మవార్లకు పురోహితులు మనోహరశర్మ అమ్మవార్లను నూతన వస్త్రాలతో అలంకరించారు.







కోడుమూరు: వెండికవచ అలంకరణలో వల్లెలాంబదేవి,బాలత్రిపుర సుందరి దేవిగా కాళికా దేవి, బాలత్రిపుర సుందరి దేవి

ఓర్వకల్లు: హుసేనాపురంలో కొలువుదీరిన అమ్మవారు

సి.బెళగల్: అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

గడివేముల: మండల పరిధిలోని నంద్యాల–నందికొట్కూరు రహదారిలోని బూజునూరు వద్ద బుధవారం రాత్రి లారీ–మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని చిందుకూరు గ్రామానికి చెందిన బింగి ఎల్లా అర్జున్ (34) పిల్లలకు సెలవులు కావడంతో భార్య సొంత ఊరైన నందికొట్కూరు మండలం దామగట్ల గ్రామంలో వదిలిపెట్టి బుధవారం రాత్రి ఇంటికి బయలు దేరాడు. జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి లోడుతో వెళ్తున్న లారీని వెనకవైపు మోటార్ సైకిల్‌తో ఢీ కొట్టాడు. దీంతో ఎల్లా అర్జున్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి భార్య బింగి రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు: ప్రజల సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ తిప్పన్న అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యేతో పాటు, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, ఎంపీడీఓ శివనాగప్రసాద్, తహసీల్దార్ విద్యాసాగర్ హాజరయ్యారు. ముందుగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను సభకు వివరించారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల పట్టాలపై క్షేత్ర స్థాయి విచారించి అనర్హులైన వారివి రద్దు చేయాలని గుట్టపాడు సర్పంచ్ మోహన్‌రెడ్డి అధికారులను కోరారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల పొలాల్లోని రాళ్లగుట్టలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని మీదివేముల ఎంపీటీసీ సభ్యులు పద్మనాభరెడ్డి కోరారు. అనంతరం ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి మండలానికి 2650 క్వింటాళ్ల శనగ విత్తనాలను మంజూరు చేసినట్లు ఏఓ సుధాకర్ తెలుపగా రాయితీని మరింత పెంచాలని పద్మనాభరెడ్డి కోరారు. గత ప్రభుత్వం 2023లో మండలంలో పంటనష్ట పరిహారం కింద 8185 మంది రైతులకు రూ.7.91 కోట్లు, అలాగే రైతు భరోసా కింద 9,956 మంది రైతులకు రూ.7.46 కోట్లు చెల్లించిందని ఏఓ వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇళ్ల పట్టాలను క్షేత్రస్థాయి పరిశీలన జరిపి అనర్హులను తొలగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

ఘనంగా కేవీపీఎస్ ఆవిర్భావ వారోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న మండి ఆనంద్ బాబు

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామంలో గురువారం కేవీపీఎస్ 26వ ఆవిర్భావ వారోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. గ్రామ నాయకులు నాగశేషులు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం మారెమ్మ దేవాలయం సమీపాన నిర్వహించిన సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మండి ఆనంద్ బాబు మాట్లాడారు. సబ్‌ప్లాన్ నిధులు దళితుల ప్రయోజనాలకే ఖర్చు చేయాలన్నారు. డప్పు కళాకారులు, చర్మకారుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కాటికాపరులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి భృతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో డప్పు కళాకారులు బిచ్చన్న, కృష్ణుడు, నాగేశ్వరరావు, కృష్ణా, సుంకన్న, దాసు తదితరులు పాల్గొన్నారు.




నిలువెత్తు నిర్లక్ష్యం..!

బైన్‌దొడ్డిలో పిచ్చిమొక్కలతో మూసుకుపోయిన ట్రాన్స్‌ఫార్మర్, కరెంట్ స్తంభాలు

కోడుమూరు రూరల్ : కోడుమూరు మండలం బైన్‌దొడ్డి గ్రామంలో రెండు కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను పిచ్చిమొక్కలు, తీగలు పూర్తిగా కప్పేశాయి. ఎంతగా అంటే అక్కడ పరిశీలనగా చూస్తేగాని కరెంట్ ట్రాన్స్‌ఫారం ఉందనే విషయం తెలియనంతగా తీగలు మూసుకుపోయాయి. వీటిని సకాలంలో తొలగించాల్సిన విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వానలు పడే సమయంలో ఏవైనా పశువులు గడ్డి, మొక్కలను తినేందుకు వెళ్తే ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉందని బైన్‌దొడ్డి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫారాలను కప్పేసిన పిచ్చిమొక్కలను తీగలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నీకది... నాకిది !

- గ్రామాలను పంచుకున్న కార్యదర్శులు
- ఏళ్లతరబడి ఒకే మండలంలోనే కొనసాగుతున్న వైనం
- ఓర్వకల్లులో సర్దుబాటు తీరిది




మద్దిలేటి, రవికుమార్



ఎంపీడీఓ కార్యాలయం

ఓర్వకల్లు: పంచాయతీ కార్యదర్శులు బదిలీల ప్రక్రియపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ పలుకుబడి ఉన్నవారు కోరుకున్న స్థానం .. లేదా ఉన్న మండలంలోనే ఇంకో గ్రామంలో కొనసాగేలా అధికారబలాన్ని చూపారని ఆరోపణలు వస్తున్నాయి. రాజకీయ, ఆర్థిక బలం ఉన్న కార్యదర్శులు కోరుకున్న స్థానం దక్కించుకోగా, ఏ విధమైన అండలేని వారిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు ఓర్వకల్లు మండలం ప్రత్యక్ష సాక్ష్యం. ఈ మండలలో మొత్తం 15 మంది కార్యదర్శులు ఉన్నారు. వీరి బదీలలో రాజకీయ పలుకుబడి మెండుగా ఉంది. ఇంకో విధంగా చెప్పాలంటే 'నీకు ఆ గ్రామం... నాకు ఈ గ్రామం' అన్నట్లుగా పంచుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐదేళ్లలోపు సర్వీసు ఉన్న లక్ష్మికాంతారెడ్డి(సోమయాజుల పల్లె), జయపరిమల(గుట్టపాడు) కార్యదర్శులు మాత్రం అదే స్థానాల్లో కొనసాగుతున్నారు. నన్నూరు కార్యదర్శి వై.ప్రభాకర్, పూడిచెర్ల కార్యదర్శి టి. ప్రభాకర్, ఓర్వకల్లు కార్యదర్శి అజార్ అహ్మద్, ఎన్ కొంతలపాడు కార్యదర్శి లక్ష్మిరత్నమ్మ, కేతవరం కార్యదర్శి సతీష్ కుమార్ మాత్రం ఇతర మండలాలకు బదిలీ అయ్యారు. ఇక మిగిలిన కార్యదర్శులు మండలంలోని గ్రామాలలోనే సర్దుబాటు చేసుకున్నట్లుగా ఉంది. ఇంకో విధంగా చెప్పాలంటే గ్రామాలను వారికి అనుకూలంగా పంచుకున్నట్లుగా ఉందంటున్నారు మండల ప్రజలు.

ఫెవికోల్ వీరులు వీరే....

ప్రత్యేకించి పంచాయతీ కార్యదర్శులు మద్దిలేటి, రవికుమార్ పదేళ్లకుపైగా ఓర్వకల్లు మండలంలోనే తిష్ట వేశారు. ఇక్కడే ఏళ్లతరబడి విధులు నిర్వర్తిస్తుండడంతో వీరు ఫెవికోల్ వీరులుగా పేరొందారు కూడా. వీరు అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సత్సంబంధాలు ఉన్నాయి. ఏ సమస్యనైనా నిశ్శబ్దంగా పరిష్కరించడంలో వీరు దిట్ట అనే పేరు సంపాదించుకున్నారు. దీంతో ఎంపీడీఓ సైతం వీరి విషయంలో ఆచీతూచీ వ్యవహరించాల్సిన పరిస్థితి నెలకొంది. ఏ గ్రామానికైనా ఇన్‌చార్జ్ కార్యదర్శి అవసరం అయితే మద్దిలేటి ముందు వరుసలో ఉంటారు. ఓర్వకల్లు మండలానికే ఈయన ప్రత్యేక కార్యదర్శి అనే పేరు సంపాదించుకున్నారు. పదేళ్లకు పైగా మండలంలో విధులు నిర్వర్తించిన వీరు వేరే మండలానికి బదిలీ అవ్వని తీరుపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ పలుకుబడి ఉంటే అంతే మరి అంటూ నిట్టూర్చుతున్నారు మండల ప్రజలు.

బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శుల వివరాలు

పీఎస్ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
అజార్ అహ్మద్	ఓర్వకల్లు	ఆగవేలి
శ్రీలత	ఉయ్యాలవాడ	కన్నమడకల
మద్దిలేటి	హుసేనాపురం	లొద్దిపల్లె
లక్ష్మిరత్నమ్మ	ఎన్ కొంతలపాడు	లింగందిన్నె
సౌజన్య	ఉప్పలపాడు	మీదివేముల
సతీష్‌కుమార్	కేతవరం	నూదపల్లె
సురేష్‌కుమార్	లొద్దిపల్లె	హుసేనాపురం
టి.ప్రభాకర్	పూడిచెర్ల	హెచ్.కైరవాడి
భాస్కర్‌రెడ్డి	మీదివేముల	శకునాల
వై.ప్రభాకర్	నన్నూరు	ఆలూరు
సీహెచ్ నాగరాజు	సి.బెలగళ్	ఓర్వకల్లు
వెంకటేష్ నాయక్	రామళ్లకోట	ఉయ్యాలవాడ
కిరన్‌కుమార్	పడిదంపాడు	కేతవరం

నిడ్జూరులో ఉచిత కంటి వైద్య శిబిరం



ఉచితంగా కళ్లజోడు అందజేస్తున్న ఎన్ఆర్ఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రొఫెసర్ పెంచలయ్య

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని నిడ్జూరులో గురువారం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఆర్.విష్ణువర్ధన్‌రెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ పెరుగు శివారెడ్డి, రీజినల్ కంటి వైద్యశాల సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ పెంచలయ్య ఆధ్వర్యంలో సిబ్బంది కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 300 మందికి కళ్లజోడు, కంటి సమస్యలకు సంబంధించిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రోహేల్, డాక్టర్ క్రితిక, సత్యం రెడ్డి, శంకర్‌రెడ్డి, సర్వేశ్వరరెడ్డి, సర్పంచ్ కె.మాధవి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అధికారులు బదిలీ

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం ఎంపీడీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులు బదిలీ అయ్యారు. ఎంపీడీ దస్తగిరి బండిఆత్మకూరుకు బదిలీపై వెళ్లగా గోనెగండ్ల ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ ఇక్కడికి బదిలీ అయ్యారు. పాణ్యం ఈఓఆర్డీ సులోచన దొర్నిపాడుకు బదిలీకాగా ఆమె స్థానంలో హోలగుంద ఈఓఆర్డీ చంద్రమౌళిశ్వరగౌడ్‌ను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. అలాగే ఏఓ నరసింహారెడ్డి వెలుగోడుకు బదిలీ కాగా రుద్రవరంలో పని చేస్తున్న వరలక్ష్మీ పాణ్యంకు బదిలీపై వచ్చారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



పంటల సాగులో మెలకువలను రైతులకు వివరిస్తున్న ఏడీఏ సాలురెడ్డి



ఎల్‌కె తండాలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ

కోడుమూరు రూరల్ : పంటలు సాగులో నూతన యాజమాన్య పద్ధతులను తప్పక పాటించాలని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి సూచించారు. గురువారం మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో ఏఓ రవిప్రకాష్ రైతులతో కలిసి 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఏడీఏ సాలురెడ్డి రైతులతో మాట్లాడారు. పెట్టుబడులను సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలన్నారు. యేటా ఒక పంట కాకుండా పంట మార్పిడి తప్పని సరిగా చేయాలని సూచించారు. ఏఓ రవి ప్రకాష్ మాట్లాడుతూ ఖరీఫ్ కింద సాగు చేసిన కంది పంట ప్రస్తుతం పూత దశకు చేరుకుందన, రైతులంతా నిత్యం పంటలను పరిశీలిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ గిరీష్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గడివేముల: పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ హేమసుందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఎల్‌కే తంగా, కొర్రపోలూరు గ్రామాల్లో ఏఓ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీపై శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగ భద్రత కల్పించండి



కోడుమూరులో ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు వినతి పత్రం ఇస్తున్న వలంటరీలు

కోడుమూరు రూరల్ : ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు కోడుమూరు మండలం వలంటీర్లు వినతి పత్రం అందజేశారు. అనంతరం వలంటీర్లు మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు నాయకుడు వలంటీర్లకు రూ. 10 వేలు జీతం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలలుగా జీతాలు రాక, ఇతర ఉద్యోగాలకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం స్పందించి వలంటీర్లకు న్యాయం చేయాలని, ఎన్నికల ముందు రాజీనామా చేసిన వలంటీర్లను కూడా విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వలంటీర్లు కుమార్, జాకీర్‌హుసేన్, రంగస్వామి, ఖాజామొద్దీన్, మనోజ్, అశోక్, చెన్నప్ప, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.